సాక్షి
రంగారెడ్డి

శనివారం | 3 | జూన్ | 2023

రేపు దుర్గం చెరువులో డ్రోన్ షో

గచ్చిబౌలి: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గంచెరువులో ఆదివారం సాయంత్రం 7.30 గంటలకు డ్రోన్ షో నిర్వహిస్తున్నట్లు సైబరాబాద్ పోలీసులు తెలిపారు. తెలంగాణ ప్రగతిని ప్రతిబింబిస్తూ 500 డ్రోన్‌లు రంగురంగుల కాంతులు విరజిమ్ముతూ ప్రదర్శనలో పాల్గొంటాయన్నారు. హోంమంత్రి మహమూద్ అలీ హాజరుకానున్నారు. ప్రజలు వీక్షించేందుకు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న మంత్రి సబితారెడ్డి, కలెక్టర్ హరీశ్ తదితరులు



ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

న్యూస్‌రీల్

అమరవీరులకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న మంత్రి సబితారెడ్డి, కలెక్టర్ హరీశ్, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు

హుడాకాంప్లెక్స్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద అమరవీరుల స్థూపానికి మలిదశ ఉద్యమ అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మతో కలిసి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ హరీశ్, మూసీ రివర్ బోర్డు చైర్మన్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, యెగ్గే మల్లేశం, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్, డీసీపీ సాయిశ్రీ, ఏసీపీ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ సేవలను విస్తరిస్తాం

మంత్రి సబితారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పాఠకులకు మరింత చేరువయ్యేలా గ్రంథాలయ సంస్థ సేవలను విస్తరిస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. కొంగరకలాన్‌లోని కలెక్టరేట్ కార్యాలయ భవన సముదాయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఏర్పాటు చేసిన పౌర పఠన కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలెక్టరేట్‌కు ఆయా పనుల నిమిత్తం వచ్చే వారికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్ల టెక్నాలజీతో మధ్యలో గ్రంథాలయాల వినియోగం కొంత తగ్గిందన్నారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రకటనలతో ఉద్యోగార్థులు గ్రంథాలయాలకు క్యూ కడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడత 30 పఠన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. ఈ నెల 20న వీటిని ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్యేలతో చర్చించి రెండో విడత మరో యాభై కేంద్రాలను మంజూరు చేస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రూ.9 కోట్లతో నూతన గ్రంథాలయ భవనాల నిర్మాణం పూర్తి కావస్తోందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హరీశ్, అదనపు కలెక్టర్లు ప్రతీక్‌జైన్, తిరుపతిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, కార్యదర్శి మనోజ్‌కుమార్, అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మ, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, డీపీఓ శ్రీనివాస్ రెడ్డి, వయోజన విద్య ఉప సంచాలకులు గణేశ్, జైహింద్ తదితరులు పాల్గొన్నారు.

నార్ముల్ మదర్ డెయిరీ సిబ్బందికి వేతనాల పెంపు

హయత్‌నగర్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా తమ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచుతున్నట్లు నార్ముల్ మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి ప్రకటించారు. డెయిరీ కార్యాలయం వద్ద శుక్రవారం జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. సంస్థలో పని చేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని, సంస్థ ఆర్థిక వనరులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులందరికీ తగిన న్యాయం చేస్తామని అన్నారు. ఆఫీస్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లకు రూ.1,507, అసిస్టెంట్‌లకు రూ.2,777, హెల్పర్లకు రూ.3.012 చొప్పున పెంచుతున్నట్లు చెప్పారు.

రేపు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసు విభాగం ఆదివారం సురక్ష దినోత్సవం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సంజీవయ్య పార్క్–చార్మినార్ మధ్య గస్తీ వాహనాల ర్యాలీ, అంబేడ్కర్ విగ్రహం వద్ద టెక్నాలజీ ఎగ్జిబిషన్, ట్యాంక్‌బండ్‌పై ఉమెన్ సేఫ్టీ కార్నివాల్, ఎంజే మార్కెట్ నుంచి చార్మినార్ వరకు పాదయాత్ర కార్యక్రమాలు జరుగనున్నాయి. వీటి నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో వేర్వేరు సమయాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12 వరకు సంజీవయ్య పార్క్–చార్మినార్ మధ్య మార్గంలో, ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ట్యాంక్‌బండ్, పీవీఎన్ఆర్ మార్గ్‌లో, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై, రాత్రి 10 నుంచి 11 గంటల వరకు ఎంజే మార్కెట్–చార్మినార్ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా ట్రాఫిక్ పోలీసు అధికారిక సోషల్‌మీడియాతో పాటు 90102 03626 నంబర్‌లో సంప్రదించాలని సుధీర్‌బాబు సూచించారు.

అభివృద్ధి ఘనత మాదే..

తెలంగాణ ఆచరిస్తోంది.. దేశం అనుసరిస్తోంది

- రాష్ట్రం ఆర్థికంగా ఎంతో పురోగతి సాధించింది
- దశాబ్ది వేడుకల్లో మంత్రి సబితారెడ్డి
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. తెలంగాణ ఆచరిస్తుంటే.. దేశం అనుసరిస్తోందన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కలెక్టర్ హరీశ్‌తో కలిసి పోలీసు అధికారులతో గౌరవ వందనం స్వీకరించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ కళారూపాలతో అలరించారు. ఈ సందర్భంగా తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మను సన్మానించారు. అనంతరం మంత్రి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

తలసరి ఆదాయం పెరిగింది

తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా ఉందని పేర్కొన్నారు. ప్రత్యేక ప్రణాళికలు, ముందు చూపు కారణంగా నేడు ఆర్థికంగా ఎంతో పురోగతి సాధించిందన్నారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. 2014–15లో జిల్లా తలసరి ఆదాయం రూ.2,83,636 ఉండగా, ప్రస్తుతం రూ.6,69,102కు చేరుకుందన్నారు. రూ.3,198 కోట్లతో విద్యుత్ సరఫరా వ్యవస్థను మెరుగుపర్చడం జరిగిందన్నారు.

త్వరలో రెండో విడత గొర్రెల పంపిణీ

ఆసరా పథకం కింద జిల్లాలో 2,03,500 మంది లబ్ధిదారులకు నెలకు రూ.51 కోట్లు చెల్లిస్తున్నట్లు చెప్పారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో 12,061 స్వయం సహాయక సంఘాలకు రూ.811 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందజేస్తున్నామన్నారు. 2023–24 సంవత్సరానికి రూ.710 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.14.53 కోట్లతో 8.71 వేల పనిదినాలు కల్పించామన్నారు. దళితబంధు పథకం ద్వారా ఇప్పటి వరకు 697 మంది లబ్ధిదారులకు రూ.69.70 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఉచిత విద్యుత్ పంపిణీ పథకంలో భాగంగా 9,326 మంది రజకులకు రూ.4.12 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రెండో విడత గొర్రెల పంపిణీలో భాగంగా రూ.531 కోట్లతో 30,343 యూనిట్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు.

రూ.కోట్లలో అభివృద్ధి పనులు

16 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ.129 కోట్లు కేటాయించగా ఇప్పటికే రూ.77 కోట్లతో 19 వైకుంఠధామాలు, 16 సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రూ.131.40 కోట్లతో తుక్కుగూడ, జల్‌పల్లి, బడంగ్‌పేట్, మీర్‌పేట్ మున్సిపాలిటీల్లో 163 అంతర్గత రోడ్ల పనులు చేపట్టినట్లు చెప్పారు. చేవెళ్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో హెచ్ఎండీఏ ద్వారా రూ.20 కోట్లతో పనులు చేపట్టామన్నారు. భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా ధరణి పోర్టల్‌కు 1,97,947 దరఖాస్తులు అందగా, వీటిలో 1,02,575 ఆమోదించగా, మరో 80,209 వివిధ కారణాలతో తిరస్కరణకు గురైనట్లు వివరించారు.



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

రైతులు జీవితాల్లో వెలుగులు

తొమ్మిదేళ్ల స్వల్ప కాలంలోనే తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందని మంత్రి పేర్కొన్నారు. 24 గంటల విద్యుత్, సాగునీరు, తాగునీరు, రైతుబంధు, రైతు బీమా, రుణమాఫీ వంటి పథకాలతో రైతుల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు ఇప్పటికే 60 శాతం పూర్తయ్యాయని, త్వరలోనే పూర్తి చేసి జిల్లా వాసులకు సాగునీరు అందజేస్తామన్నారు. అర్బన్ మిషన్ భగీరథ ద్వారా మహేశ్వరం నియోజకవర్గంలో రూ.362 కోట్లతో, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.213 కోట్లు, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రూ.323 కోట్లతో ఇంటింటికీ తాగునీటిని అందించే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. కంటి వెలుగు పథకంలో భాగంగా ఇప్పటి వరకు 7.54 లక్షల మందికి కంటి పరీక్షలు చేసి, 1.85 మందికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేసినట్లు వివరించారు.

దొంగ బాబా దొరికాడు

రూ.1.80 లక్షల నగదు స్వాధీనం

నందిగామ: 'మీ ఇంట్లో బంగారం ఉంది తవ్వి తీస్తాను.. మీ భర్తకు ప్రాణ గండం ఉంది.. ప్రాణగండం నుంచి గట్టెకిస్తాను' అంటూ ఓ మహిళకు మాయ మాటలు చెప్పి విడతల వారీగా సుమారు రూ.2.65 లక్షల నగదును తీసుకొని ఉడాయించిన దొంగ బాబాను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నందిగామ ఇన్‌స్పెక్టర్ రామయ్య కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అనంతపురం జిల్లా, గుత్తి మండలం బాచుపల్లి గ్రామానికి చెందిన ముగ్గు ఎర్ర సుంకన్న అలియాస్ రాములు(20) కొంత కాలంగా కల్వకుర్తి పట్టణంలో నివసిస్తున్నాడు. రెండు నెలల క్రితం నందిగామ మండలం ఈదులపల్లికి ఓ స్వామి వేషధారణలో వచ్చాడు. గ్రామానికి చెందిన వనరాసి సునీత వద్దకు వెళ్లి తన పేరు రాములు అని, తాను శ్రీశైలం నుంచి వచ్చిన స్వామీజీని అని పరిచయం చేసుకున్నాడు. మీ జాతకం చూస్తానని చెప్పి మీ ఇంట్లో బంగారం ఉందని, మీ భర్తకు ప్రాణ గండం ఉందని చెప్పి అంతా బాగు చేస్తానని ఆమెను నమ్మించి దతల వారీగా రూ.2.65 లక్షలు తీసుకున్నాడు. డబ్బులు తీసుకొని రెండు నెలలైనా రాకపోవడంతో మోసపోయానని గ్రహించిన సునీత స్థానిక పోలీసులను ఆశ్రయించింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు రాములు కోసం గాలించారు. శుక్రవారం విశ్వసనీయ సమాచారం మేరకు షాద్‌నగర్ బస్టాండ్‌లో ఉన్నాడని తెలిసి నందిగామ పోలీసులతో పాటు శంషాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు షాద్‌నగర్‌కు వెళ్లి రాములును పట్టుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. దీంతో అతడి వద్దనున్న రూ. 1 లక్ష 80 వేలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరు పర్చి న్యాయస్థానం ఆదేశానుసారం రిమాండ్‌కు తరలించారు.



రిమాండ్‌కు తరలించిన దొంగ బాబా

వారికి పొరపాటు.. వీరికి గ్రహపాటు!

- ఉసురు తీస్తున్న స్వల్ప ఉల్లంఘనలు
- ప్రాణాలు తీస్తున్న ఎదుటి వారి నిర్లక్ష్యం
- చట్టంలో మార్పు రావాలన్న నిపుణులు
- ఎల్బీనగర్‌లో చిన్నారి మృతితో కలకలం

సాక్షి, సిటీబ్యూరో: 'తొంభై తొమ్మిది సార్లు ఉల్లంఘించినా ఏ ఇబ్బందీ రాకపోవచ్చు.. ధోరణి మారకుంటే వందోసారైనా మూల్యం చెల్లించుకోక తప్పదు' ట్రాఫిక్ ఉల్లంఘనల విషయంలో అధికారులు పదేపదే చెప్పే మాట ఇది. ఈ మూల్యం ఉల్లంఘనకు పాల్పడిన వాహనచోదకుడు చెల్లిస్తే ఒక ఎత్తు. అదే ఏ పాపం ఎరుగని ఎదుటి వ్యక్తిపై ప్రభావం చూపితే..ఆ కుటుంబం బాధ, వ్యథ వర్ణనాతీతం. గురువారం ట్యాంక్‌బండ్‌పై 30 ఏళ్ల యువకుడు గోవింద్, శుక్రవారం ఎల్బీనగర్‌లో రెండేళ్ల చిన్నారి ధనలక్ష్మి మృతికి ఇలాంటి 'పొరపాటు'లే కారణం.

వారు తీసింది డోర్ కాదు.. ప్రాణం..

నో పార్కింగ్ ప్రాంతాల్లో, అపసవ్య దిశలో వాహనాలు నిలపడమనేది అనేక మంది దృష్టిలో చాలా చిన్న విషయం. ట్రాఫిక్ పోలీసులో, మరొకరో ప్రశ్నించినా 'ఇప్పుడే వెళ్లిపోతాం' అంటుంటారు. ఇలా ఆపిన వాహనాల డోర్లు కూడా ప్రాణాలు తీస్తాయని తెలుసా. ఇలాంటి ఉల్లంఘన ధనలక్ష్మి మృతికి కారణమైంది.

ఆ రూటు 'రాంగే'..

కాస్తదూరం వెళ్లి 'యూ టర్న్' తీసుకోవాలంటే బద్ధకం. అది వన్ వే అని తెలిసినా నిర్లక్ష్యం. ఏం జరుగుతుందిలే అనే ధీమా...వెరసి సిటీలో రాంగ్‌రూట్‌లో దూసుకుపోయే వారికి కొదవే లేదు. ఇవి నిత్యం చిన్న చిన్న ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఎదుటి వారి ఉసురు తీయడంతో పాటు కుటుంబాన్నే కకలావికలం చేస్తున్నాయి. షేక్ అలీముద్దీన్ అనే యువకుడు తన బైక్‌పై రాంగ్‌రూట్‌లో దూసుకువస్తూ..మరో బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇరువురిలో సెక్యూరిటీ గార్డు కుమారుడు సత్య సాయి (15) దుర్మరణం చెందాడు. నింబోలిఅడ్డ ప్రాంతానికి చెందిన వస్త్ర వ్యాపారి గోవింద్ కర్వా (30) తన ద్విచక్ర వాహనంపై సికింద్రాబాద్ నుంచి కాచిగూడ వస్తున్నారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న చిల్డ్రన్స్ పార్క్ వద్ద రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ఢీ కొట్టి కొద్దిదూరం ఈడ్చుకెళ్లింది. అటుగా వచ్చిన మరో కారు ఢీ కొనడంతో గోవింద్ కన్నుమూశాడు.

మద్యం మత్తు, అతి వేగంతో..

మద్యం తాగడం కొందరికి సరదా అయితే మరెందరికో వ్యసనం. తమ ఆనందం కోసం మత్తులో జోగుతూ వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు తమ ప్రాణాల మీదికి తెచ్చుకోవడమే కాకుండా.. అభం శుభం తెలియని వారి జీవితాల్నీ చిత్తు చేస్తున్నారు. పట్టపగలూ యథేచ్ఛగా మత్తులో 'విహరిస్తున్నారు'. ఇలాంటి వారి బారినపడి నిత్యం అనేక మంది గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతోంది. ఇక అతివేగం విషయానికి వస్తే మణికొండ ప్రాంతానికి చెందిన శాంతమ్మ (55) తన భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తోంది. అదే సమయంలో రేసింగ్‌లో దూసుకుపోతున్న మూడింటిలో ఒక కారు వీరి వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శాంతమ్మ చనిపోగా..ఆమె భర్తకు గాయాలయ్యాయి.

సి'వీక్'సెన్స్‌కు తోడు లోపాలు: నిపుణులు

ఇలాంటి ప్రమాదాలు జరగడానికి ప్రధానంగా వాహనచోదకుల్లో కొరవడిన సెన్స్, ఆర్టీఏ విధానంలో ఉన్న లోపాలే కారణమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

మహేశ్వరం, బడంగ్‌పేట్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు

మహేశ్వరం: నియోజకవర్గంలోని మహేశ్వరం, బడంగ్‌పేటకు రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు మంజూరు చేస్తూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో మహేశ్వరం పేరు మీద ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేయగా నియోజకవర్గ కేంద్రంలో కళాశాల నిర్వహించడానికి సరైన భవనం లేకపోవడంతో బడంగ్‌పేటలో తాత్కాలికంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో బడంగ్‌పేటలోనే డిగ్రీ కళాశాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో మరో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలోని అర్బన్, రూరల్ ప్రాంతాల్లో రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు మంజూరు చేయించిన మంత్రి సబితారెడ్డికి విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



ముస్తాబైన రైతు వేదిక భవనం

ఇబ్రహీంపట్నం రూరల్: పండుగ వాతావరణంలో రైతు దినోత్సవాన్ని నిర్వహించాలని కలెక్టర్ హరీశ్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించనున్న సంబరాలకు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోని 83 రైతు వేదికలను అందంగా ముస్తాబు చేసినట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

భగ్గుమన్న భానుడు

42.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు

సాక్షి, సిటీబ్యూరో: సూర్య భగవానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. రోజురోజుకూ గరిష్ట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉదయం 8 నుంచే భగభగలతో జనం అల్లాడుతున్నారు. నాలుగు రోజులుగా సాధారణం కంటే రెండు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. శుక్రవారం 42.7 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. నైరుతి రుతుపవనాలు మరో వారం, పది రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశిస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నప్పటికీ ఎండల ప్రభావం ఏ మాత్రం తగ్గడం లేదు. గురువారం అత్యధికంగా 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదుకాగా, శుక్రవారం 42.7 డిగ్రీలకు చేరింది. గణాంకభవన్, గచ్చిబౌలి, షేక్‌పేట, ముషీరాబాద్, బాలాజీనగర్, మోండా మార్కెట్, బీహెచ్ఎల్, డబీరురా, మారుతీనగర్, మల్కారం, షాపూర్, కాప్రా, మెహిదీపట్నం, ఉప్పల్, బండ్లగూడలలో అత్యధికంగా ఉష్ణోగ్రత నమోదైంది.

ప్రభుత్వ భూమికి ఎసరు!

- హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్‌లో ఆక్రమణల పర్వం
- సర్వే నంబర్ 71/1 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు
- రెవెన్యూ అధికారులే అసలు సూత్రధారులు..!



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కంచె చేను మేసినట్లు ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులే ఏకంగా బినామీ పేర్లతో కాజేసేందుకు యత్నిస్తున్నారు. సీలింగ్ భూములకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో రాత్రికి రాత్రే ప్రీకాస్ట్‌తో రూమ్‌లు, వాటి చుట్టూ ప్రహరీలు ఏర్పాటు చేశారు. ఈ భూములను జీఓ నంబర్ 118 జీఓ కింద ప్రభుత్వానికి దరఖాస్తు చేసి, గుట్టుగా ఆమోదింపజేస్తున్నట్లు సమాచారం. హయత్‌నగర్ మండలం, సాహెబ్‌నగర్ సర్వే నంబర్ 71/1లో 1.20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఒకవైపు వక్ఫ్‌బోర్డుకు చెందిన భూములు..మరో వైపు లావుణి పట్టా భూములకు మధ్యలో ఈ సర్వే నంబర్‌లోని భూములు ఉన్నాయి . ఇక్కడ గజం ధర రూ.40 వేలకుపై మాటే.

118 జీఓను అవకాశంగా తీసుకుని

ఖరీదైన ఈ భూములపై కొంత మంది స్థానిక రెవెన్యూ అధికారుల కన్నుపడింది. ఎలాగైనా వీటిని సొంతం చేసుకోవాలని భావించారు. ఆ మేరకు ప్రభు త్వం ఇటీవల తీసుకొచ్చిన (ఎల్బీనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధిలోని 44 కాలనీల్లోని అర్బన్ సీలింగ్ భూములను రెగ్యులరైజ్ చేసేందుకు) జీఓ నంబర్ 118ను అవకాశంగా తీసుకున్నారు. ఇటు గుట్టకు..అటు నివాసాలకు మధ్యలో ఉన్న ఖాళీ భూమిలో రాత్రికి రాత్రే ప్రీకాస్ట్ గోడలు నిర్మించారు. పక్కనే ఉన్న సర్వే నంబర్స్ 71/2, 71/3 వెంచర్ లోని బార్డర్ ప్లాట్స్‌కి బై నంబర్స్ వేసి దరఖాస్తు చేస్తున్నారు. చిన్న రూమ్ వేసి కబ్జాలో ఉన్నట్లు చూపించారు. నిర్మాణాల ఫొటోలు తీసి బినామీల పేరుతో రెగ్యులరైజేషన్ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. క్షేత్రస్థాయి పరిశీలకులు కూడా వారే కావడం వారికి కలిసి వచ్చింది. విద్యుత్ అధికారులు కూడా వీరికి సహకరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎలాంటి డాక్యుమెంట్లు లేని నిర్మాణాలకు మీటర్లు జారీ చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

దృష్టికి వచ్చింది

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు వెలిసిన అంశం ఇటీవల దృష్టికి వచ్చింది. వారం రోజుల్లో సర్వే చేయిస్తాం. అక్రమ నిర్మాణాలు కూల్చివేయిస్తాం. ఒక వేళ 118 జీఓ కింద రెగ్యులరైజ్ అయితే..వాటిని కూడా రద్దు చేయిస్తాం. ఆక్రమణల్లో రెవెన్యూ అధికారుల పాత్ర ఉందనే ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదు.

– సంధ్యారాణి, తహసీల్దార్, హయత్‌నగర్

ప్రారంభానికి సిద్ధమైన ఫార్మాసిటీ ఠాణా

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఠాణా ప్రారంభానికి సిద్ధమైంది. ఆది లేదా సోమవారాల్లో ఈ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించేందుకు పోలీస్ ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు నక్కర్తమేడిపల్లిలోని ఓ అద్దె భవనంలో పోలీస్ స్టేషన్‌కు కావాల్సిన ఏర్పాట్లను యాచారం సీఐ లింగయ్య పూర్తి చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫార్మాసిటీ రక్షణ కోసం ప్రత్యేకంగా హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. నక్కర్తమేడిపల్లి– నానక్‌నగర్ గ్రామాల మధ్య నూతన పోలీస్ స్టేషన్ శాశ్వత భవన నిర్మాణానికి టీఎస్ ఐఐసీ స్థలాన్ని కేటాయించింది. యాచారం, కందుకూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని 19 పంచాయతీలు, వాటి అనుబంధ గ్రామాలు ఈ ఫార్మాసిటీ ఠాణా పరిధిలో ఉండనున్నాయి. ముందుగా ఫార్మాసిటీ ఠాణా ఎస్‌హెచ్‌ఓగా ఒక సీఐని నియమించనున్నారు. యాచారం, కందుకూరు పోలీస్ స్టేషన్ల నుంచి ఇద్దరు ఎస్‌ఐలను, ప్రత్యేకంగా మరో 30 మంది సిబ్బందిని నియమించనున్నారు. పోలీస్ స్టేషన్ ప్రారంభమైన మరుక్షణం నుంచే ఠాణా సేవలను అందుబాటులోకి తెచ్చేలా పోలీస్ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఫార్మాసిటీ ఠాణా

దివ్యాంగులకు ఉచిత విద్య

- వేగేశ్న ఫౌండేషన్ సేవలు విస్తరిస్తాం
- ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీరామరాజు వెల్లడి



వంశీరామరాజు

అబ్దుల్లాపూర్‌మెట్: దివ్యాంగులైన చిన్నారులకు ఆంగ్ల మాధ్యమంలో ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్య అందిస్తామని వేగేశ్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీరామరాజు, చైర్‌పర్సన్ సుంకరపల్లి శైలజ తెలిపారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని వారు మాట్లాడుతూ 35 ఏళ్లుగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్‌లో తమ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు ఎనలేని సేవలందిస్తున్నామన్నారు. వేగేశ్న ఫౌండేషన్ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు వారు తెలిపారు. శారీరక దివ్యాంగులైన వారికి ఫిజియో థెరపీ, సర్జికల్ కరెక్షన్స్, కృత్రిమ అవయవాలను ఫౌండేషన్ ద్వారా సమకూర్చనున్నట్లు చెప్పారు. దివ్యాంగులైన వారి పిల్లలకు కూడా తమ ఫౌండేషన్ ద్వారా ఉచిత సేవలు అందించనున్నామన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో చదువుకుంటున్న దివ్యాంగులైన చిన్నారులకు కావాల్సిన సహకారాన్ని అందిస్తామన్నారు. తమ ఫౌండేషన్‌ద్వారా ఉచిత సేవలను పొందాలనుకునే వారు కుంట్లూర్‌లోని వేగేశ్న ఫౌండేషన్‌లో ఈ నెల 13వ తేదీ నుంచి సంప్రదించాలని కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



యాలాల కృష్ణారెడ్డి



పాల్వాయి రవి

కందుకూరు: మండల పరిధిలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం చెందారు. ఎస్‌ఐ శ్రావణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నేదునూరుకు చెందిన యాలాల కృష్ణారెడ్డి(45) కందుకూరు చౌరస్తాలో నివాసం ఉంటూ వ్యవసాయంతో పాటు పాల వ్యాపారం చేస్తుంటారు. రోజు మాదిరి శుక్రవారం తెల్లవారు జామున స్కూటర్‌పై పాలతో బయలుదేరారు. మార్గమధ్యంలో నేదునూర్ గేట్ వద్ద శ్రీశైలం రహదారిపై నిలిపిన లారీని గుర్తించక వెనక నుంచి కృష్ణారెడ్డి స్కూటర్‌తో ఢీకొన్నాడు. దీంతో తీవ్రగాయాలైన అతన్ని మహేశ్వరం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

మండల పరిధిలోని లేమూరుకు చెందిన పాల్వాయి రవి (45) కుల వృత్తి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గురువారం రాత్రి లేమూరు నుంచి ఆమనగల్లులోని బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో బైరాగిగూడ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉన్న కారు రాచులూరు గేట్ వైపు బయలుదేరే క్రమంలో రోడ్డుపైకి ఎక్కింది. వెనక నుంచి వస్తూ అకస్మాత్‌గా రోడ్డు పైకి వచ్చిన కారును గమనించని రవి, అదుపుతప్పి ఆ కారును ఢీకొని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

డిగ్రీ విద్యార్థి అదృశ్యం



రాజేందర్‌రెడ్డి (ఫైల్)

మొయినాబాద్: కాలేజీకి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లిన డిగ్రీ విద్యార్థి అదృశ్యమైన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిలుకూరులో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నా యి. చిలుకూరుకు చెందిన బండారి రాజేందర్‌రెడ్డి(21) హైదరాబాద్‌లోని నారాయణగూడలోని జాగృతి డిగ్రీ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఎప్పటి మాదిరిగానే ఈనెల ఒకటిన ఇంట్లోనుంచి కాలేజీకి వెళ్తున్నట్లు చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు అంతటా వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో అన్న రవీందర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మీర్‌పేటలో మరొకరు



విజయ్ (ఫైల్)

మీర్‌పేట: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ ఉదయ్‌భాస్కర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లెలగూడ టీఆర్‌ఎస్ కాలనీకి చెందిన కదారి విజయ్ (29) వృత్తి రీత్యా మేస్త్రీ. ఈ నెల ఒకటిన రాత్రి విజయ్ తన సోదరుడు శేఖర్‌కు ఫోన్ చేసి తన పిల్లలను చూసుకోవాలని చెప్పి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి కనిపించకుండా పోయాడు. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సోదరుడు శేఖర్ శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేయండి

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రెండో విడత గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పశుసంవర్ధక శాఖ అధికారులతో గొర్రెల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడతామన్నారు. లక్షా డెబ్బై ఐదు వేల రూపాయలతో 20 గొర్రెలు, ఒక పొట్టేలు పెంపకందారులకు అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1,31,250 సబ్సిడీ అందజేస్తుందని, లబ్ధిదారుడు తమ వాటాగా రూ. 43,750 చెల్లించాలని చెప్పారు. పశుసంవర్ధక శాఖ ఏడీ స్థాయి అధికారి పర్యవేక్షణలో గొర్రెలను లబ్ధిదారులకు నేరుగా అందజేస్తారన్నారు. నియోజకవర్గంలోని 10 వేల గొల్ల, కురుమ, మేకల పెంపకందారుల కుటుంబాలకు ఈ పథకం ద్వారా లబ్ధిచేకూరుతుందన్నారు. మొదటి విడతలో 2,445 యూనిట్ల పంపిణీ చేయగా రెండో విడతలో 7,674 యూనిట్లను ఆయా కుటుంబాలకు అందజేయనున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు పరుస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, పశుసంవర్ధక శాఖ ఏడీ వసంతకుమారి, పశు వైద్య సిబ్బంది డాక్టర్ సురేందర్, సరేశ్‌బాబు, కిరణ్, నర్సింహారావు, రేఖ, నాగమణి, సుధ పాల్గొన్నారు.

వడదెబ్బతో 'ఉపాధి' కూలీ మృతి



పెంటమ్మ (ఫైల్)

కొందుర్గు: వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతిచెందిన ఘటన మండల పరిధిలోని వెంకిర్యాల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామంలోని సంజీవ్‌పూర్‌తండా వద్ద పాటుకాల్వ పనులు చేపడుతున్నారు. దాదాపు 70 మందికి పైగా పనులకు వెళ్తున్నారు. శుక్రవారం మోత్కూరి చిన్నపెంటమ్మ (57)తో పాటు ఆమె కుటుంబ సభ్యులు పనులకు వెళ్లారు. పనులు నిర్వహిస్తుండగానే పెంటమ్మ వడదెబ్బకు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఇప్పటివరకు తమతో కలిసిపనిచేసి అప్పుడే తుది శ్వాస విడిచిందని కుటుంబసభ్యులు బోరున విలపించారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పెంటమ్మ మరణించిందని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, సీఐటీయూ మండల నాయకులు రాయికంటి గోపాల్ అన్నారు. పని ప్రదేశంలో కూలీలు సేద తీర్చుకోవడానికి టెంట్లు ఏర్పాటుచేయాల్సి ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కనీసం ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచకపోవడం బాధాకరమన్నారు. పెంటమ్మ కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నందిగామ: రోడ్డు పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. ఈ ఘటన రంగాపూర్ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రంగాపూర్ శివారులో సుమారు 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం ఉన్నట్లు అందిన సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించామని చెప్పారు. మృతి చెందిన వ్యక్తి భిక్షాటన చేస్తూ జీవిస్తుంటాడని తెలిసిందని, అనారోగ్య సమస్యలు లేదా వడ దెబ్బ కారణంగా చనిపోయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శి రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

సివిల్ ర్యాంకర్ సుస్మితకు సన్మానం



సుస్మితను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన సివిల్ సర్వీసెస్ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటి 384 ర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన సుస్మితను మంగళవారం షాద్‌నగర్ కిరాణ మర్చంట్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుస్మితకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పలబట్ల బాల్‌రాజ్, అధ్యక్షుడు బలపట్ల సతీశ్, కార్యదర్శి కూచారి ప్రవీణ్, గార్లపాటి శ్రీనివాస్, చెన్నారపు ప్రవీణ్, నర్సింహ, కరుణాకర్, అభి, రాజు, శ్రీనివాస్, వెంకటేష్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

షాట్‌పుట్‌లో సత్తాచాటిన సేవ్యానాయక్



కడ్తాల్: మండల పరిధిలోని గానుగుమార్లతండాకు చెందిన సేవ్యానాయక్ రాష్ట్ర స్థాయి షాట్‌పుట్ (సీఎం కప్-2023)లో సత్తాచాటారు. పురుషుల విభాగంలో తృతీయ స్థానం సాధించారు. కాంస్య పతకంతో పాటు, రూ.10 వేల నగదు బహుమతిని అందుకున్నారు. ఈ మేరకు సేవ్యానాయక్ స్థానిక బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి కావడంతో, శుక్రవారం పాఠశాల పీడీ చంద్రమోహన్‌తో పాటు, హెచ్‌ఎం జంగయ్య, సీఎం కప్ మండల కన్వీనర్ ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీపీ కమ్లిమోత్యా నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ ఎల్‌ఎన్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి తదితరులు క్రీడాకారుడిని అభినందించారు.

తాగుడుకు బానిసై..

పహాడీషరీఫ్: తాగుడుకు బానిసైన వ్యక్తి మృతి చెందిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. మామిడిపల్లికి చెందిన గుజ్జుల నర్సింహ(38)కు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు. తాగుడుకు బానిసైన నర్సింహకు, భార్య శివలీల మధ్య గొడవ జరగడంతో కొన్ని రోజులుగా మహబూబ్‌నగర్‌లో ఉంటోంది. గురువారం మామిడిపల్లిలోని ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బంధువుల వివాహానికి హాజరై సమీపంలోని ఫుట్‌పాత్‌పై నిద్రించి...కాసేపటికే మృతిచెందాడు. శుక్రవారం భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెల్జాల్‌లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు



టెన్నీకాయిట్ ఆడుతున్న క్రీడాకారులు

తలకొండపల్లి: రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ చాంపియన్ షిప్ 2023-24 బాలుర, బాలికల క్రీడాపోటీలను మండల పరిధిలోని వెల్జాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా అసోసియేషన్ సభ్యుల సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలు నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, పీఈటీ మల్లేష్, సర్పంచ్ సంగీత, జాతీయ టెన్నీకాయిట్ ప్రధాన కార్యదర్శి యాదయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌సుందర్, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ సంగీత, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబర్ రహ్మాన్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసామూర్తి, ఉప సర్పంచ్ అజీజ్, ఎంపీటీసీ అంబాజీ తదితరులు పాల్గొన్నారు.